## ఈవారం బహుమతి పొందిన కథ

వ్రాయునది మీ ఉత్తరం అందింది. మా నాన్నగారు అస్వస్థులుగా ఉన్నందువల్ల మీ ఆతిథ్యాన్ని స్వీకరించలేకపోతున్నందుకు మన్నించగలరు. అన్యథా భావించక మీరే ఇక్కడకు వచ్చినచో మనమంతా ఇక్కడే సరదాగా పండగ జరుపుకుందాం. మీరాక కొరకు భార్గవి, నేను ఎదురుచూస్తుంటాం. తప్పక వస్తారని ఆశిస్తున్నాను.

ఇట్లు

మీ అల్లుడు, నీలేష్.

అనుకోని ఈ ఆహ్వానానికి పరమేశ్వరరావు దంపతులు ఆశ్చర్యచకితులయ్యారు.

'ఇంత మంచి అల్లుడు ఎవరికైనా ఉంటాడుటండీ!' అంటూ మురిసిపోయింది శారద.

పండగ రేపనగా పరమేశ్వరరావుగారింటి ముందు రెండు రిక్షాలాగాయి. రెండు రిక్షాల నుండి రెండు జంటలు దిగాయి. ఇంటికి ఉన్న పెద్ద తాళం కప్పను చూసి వర్ణవిహీనమయ్యాయి ఆ వదనాలు.

'ఛీ...ఛీ...! బొత్తిగా మర్యాదలేని మనుషులు... పండక్కి రమ్మని ఉత్తరం రాయకపోగా, ఏదో ప్రేమగా చూసి పోదామని వస్తే ఇంటికి తాళం పెట్టి ఎటో పారిపోయారు' పెద్దల్లుడు వీధిలోనే పడి అరుస్తున్నాడు.

'పిలవని పేరంటానికి వెళ్తే బాగుండదని నేను ముందే చెప్పాను. ఇది వినిపించుకుంటేనా...!' తప్పంతా భార్యమీదకు నెట్టి ఫోజు కొట్టాడు రెండోఅల్లుడు.

ఇంతలో పక్కింటావిడ అచ్యుతాంబ వెలుపలికొచ్చింది.

'ఎవరూ... రమా, ఇందిరా! ఏమ్మా... మీకు తెలీదూ? మీ చెల్లెలు భార్గవి వాళ్లాయన పండక్కి రమ్మని మీ నాన్నకు ఉత్తరం రాశాడుటగా! నిన్ననే వెళ్లారు. మీ అమ్మ 'మామంచి అల్లుడు... మంచి అల్లుడు' అంటూ అందరికీ చెప్పుకుని తెగ మురిసిపోతోంది. పిలిస్తే తినిపోయే అల్లుళ్లేకాని... అత్తమామల్ని ఇంటికి పిలిచి గౌరవించే అల్లుళ్లెవరున్నారీ రోజుల్లో! అంతాఆ పిల్ల అదృష్టం... మంచి మొగుడు దొరికాడు. అయ్యో! మరిచేపోయాను... పొయ్యిమీద పప్పు పడేశాను. మాడిపోయిందో.. ఏమో..?' అటూ లోపలికెళ్లి పోయిందామె.

రిక్షావాళ్లు కూడా ఈ చోద్యాన్ని చూస్తూ అలాగే ఉండిపోయారు. మళ్లీ రిక్షాలను పిలుచుకోవలసిన ఇబ్బంది లేకుండా వాటిల్లోనే తిరుగు ప్రయాణమయ్యారు అల్లుళ్లు... కూతుళ్లూ... తమ పాలిట శనిలాగా దాపురించిన ఈ కొత్తల్లుడ్ని తిట్టుకుంటూ. ○

ఎవిజిఎస్ మూర్తి

0.11.1989

## కంచికి పోవాల...



హడావిడిగా తొమ్మిదింటికే ఆయాసపడుతూ ఆఫీసుకొచ్చాడు సత్యం. నిన్న ఆఫీసరుగారు అడిగిన ఫైలు కనిపించనేలేదు. అసలే ఛండశాసనుడాయన. పదింటికి ఠంచనుగా ఆఫీసుకొస్తాడు. ఆయనొచ్చేలోపలే స్పీడ్‌గా వెదికేయాలని అర్జంటుగా రికార్డు రూమ్ వైపు నడిచాడు సత్యం. పది ఫైల్స్ అయినా వెతికాడో లేదో యుద్ధభూమిలో సైనికుడిలా తయారయ్యాడు. నల్లని జుట్టు దుమ్ముకొట్టుకొని తెల్లగా, తెల్లని షర్టు ధూళిపడి నల్లగా రూపాంతరం చెందినట్లు గ్రహించాడతను. కానీ ఈ చిన్న చిన్న విషయాలు పట్టించుకోదలుచుకోలేదు. దీక్షగా ఓ గంటసేపు ఫైలు కోసం వెతుకుతూనే ఉన్నాడు. గంట తర్వాత 'యురేకా' అనరిచాడు ఫైలు దొరికిన ఆనందంతో

అతని అరుపుకి భయపడిన బల్లి పట్టుతప్పి ఠప్పున అతని నెత్తిమీద పడింది. అతని భుజంమీదికి జారి, కుడిచేతి మీంచి కుడికాలిమీద పాకి హడావిడిగా వెళ్లిపోయింది. అదురుపుట్టింది సత్యానికి ఈ సంఘటనతో. బల్లి నెత్తిమీద పడితే అశుభం అని తెలుసు. కానీ కాలిమీద పడితే ఏంటో, చేతిమీద పడితే ఏంటో తెలీదు. మొత్తానికి బల్లిమీద పడితే కంచికెళ్లాలి అని తెలుసు. అసలే నెలాఖరు. లీవుకూడా లేదు. అందులో ఆఫీసరు ఛండశాసనుడు. ఇలా ఆలోచించుకుంటూ రికార్డు రూం నుంచి బయటికొచ్చి తన పక్కసీటతన్ని అడిగాడు.

'నెత్తిమీద బల్లి పడితేఏం చెయ్యాలి?'

'అమ్మో! బల్లి పడిందీ నెత్తిమీద. అయితే తప్పకుండా కంచికెళ్లాల్సిందే' సెలవిచ్చాడా సీనియర్.

'కంచికెళ్ళక తప్పదా సార్? వేరే ఉపాయమేదీ లేదా?' వాపోయాడా అమాయకుడు.

'ఇంకొక్క ఛాన్స్ ఉందోయ్. కంచికెళ్ళి అక్కడి బల్లుల్ని ముట్టుకున్న వాళ్లెవరినైనా ముట్టుకుంటే సరిపోతుంది. అప్పటివరకు మరెవర్ని ముట్టుకోకూడదు.'

'కంచికెవరెళ్లారో మనకెలా తెలుస్తుంది సార్? పోనీ మీరు వెళ్లారా సార్ ఎప్పుడైనా' ఆశగా అడిగాడు సత్యం.

'క్రిందటి సంవత్సరం కాళహస్తి వరకూ వెళ్లి కూడా కంచికెళ్లలేదోయ్. మన మూర్తి వెళ్లినట్లున్నాడు కనుక్కో' ఉచిత సలహా పడేశాడాయన.

సంతోషపడ్డాడు సత్యం. తన సమస్య ఇంత తొందరగా ముగుస్తున్నందుకు.

'క్రిందటి సంవత్సరం మీరు కంచికెళ్లార్ట కదండీ. అక్కడ బల్లుల్ని ముట్టుకొనొచ్చారా?' లంచ్‌లో మూర్తి సీట్‌దగ్గరికి వెళ్లి కులాసా కబుర్లలాగా అడిగాడు.

'ఆ! అటువంటివి మన కలవాటు లేదు బ్రదర్. మన ఆఫీసరుగారు, టైపిస్టు సరోజ మాత్రం వాటిని ముట్టుకొనొచ్చారు. మిగతా అందరూ భయపడ్డారు పాపం' నిర్విలాసంతో చెప్పాడు సిగరెట్ వెలిగించుకుంటూ.

ఎలా ఇప్పుడు? ఆఫీసర్‌గార్ని పట్టుకోవడమా? అమ్మో! ఉద్యోగం ఊడిపోతుంది. పోనీ సరోజని. అమ్మో! పళ్లురాలిపోతాయి. ఎలా? ఎలా? జుట్టు పీక్కున్నాడు. తెలిసిన వాళ్లందర్నీ గుర్తుచేసుకున్నాడు. ఎవరూ ఎప్పుడూ కంచికెళ్లాము అని చెప్పిన గుర్తు లేదు. ఎవర్నీ తాకకుండా ఐదుగంటల వరకు ఆఫీసులోనే అశాంతిగా గడిపాడు.

ఇంటికెళ్లి ఎదురొచ్చిన భార్యని చూసి గతుక్కుమన్నాడు. భార్యని ముట్టుకోకుండా ఎలా? ఇంక తొందరపడాలి అనుకొని,

'బల్లిమీద పడితే ఏం చేయాలి లక్ష్మీ' అని అడిగాడు.

'ఏంటబ్బా! అంతపెద్ద సందేహమొచ్చింది మీమీదకానీ పడిందేమిటి?'

'కంచికెళ్లి వచ్చిన వాళ్లని తాకితే ఆ పాపం పోతుందిట మా అమ్మ చెప్పేది. అందుకే చిన్నప్పుడు నన్ను కంచికి తీసుకెళ్లి నేను భయపడుతున్నా వినకుండా ఆ బల్లుల్ని తాకించింది...'

ఆమె మాట ఇంకా పూర్తికానేలేదు. ఆమె మీదపడి గట్టిగా కౌగిలించుకున్నాడు.

'అమ్మయ్య! ఇంక నేను కంచికెళ్లక్కర్లేదు' సంతోషంగా చెప్పాడు సత్యం. ○

—గొల్లపూడి శైలజ

ఈ కొత్తరచయితల శీర్షికలో ఒక మంచికథకు వారం వారం 116/– రూపాయలు బహుమతిగా అందజేస్తాం